ఇంటికే పింఛన్ల అందజేత

● ఎమ్మెల్యే విజయచంద్ర


బలిజిపేట: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బలిజిపేట: ప్రతి నెలా పంపిణీ చేయనున్న పింఛన్లు ప్రతి లబ్ధిదారు ఇంటికి వచ్చి సచివాలయ సిబ్బంది చేతికి అందజేస్తారని ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలకేంద్రంలో ఇంటింటికి పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందవద్దని, అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవ చేసేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం

సీతానగరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేయనున్నారని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం ఆయన సీతానగరం, బూర్జ గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక ఫించన్ పథకం ద్వారా మంజూరైన పింఛన్లను(రూ.7వేలు) లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బూర్జలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజల దీవెనలతో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడిందని, ప్రజలు ఏ ఆశలైతే పెట్టుకుని కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశారో వాటన్నిటినీ అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పింఛన్లు పంపిణీ చేసే సమయానికి సర్వర్ మొరాయించడంతో కొంత ఆలస్యమైనందని ఎంపీడీఓ ఈశ్వరరావు అన్నారు. ఒక్కరోజులోనే పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని నిర్ణయించడంతో గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, వేణుగోపాల నాయుడు, కె బలరాం, ఆయాగ్రామాల సర్పంచ్‌లు జె.తేరేజమ్మ, జి.దాసు,ఉపసర్పంచ్ అరవింద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో..

పార్వతీపురంటౌన్: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పట్టణంలోని 1, 30వ వార్డుల్లో ముఖ్యఅతిథిగా సోమవారం పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 9,10,16,25వ వార్డుల్లో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ 3000 నుంచి 4000కు, దివ్యాంగుల పింఛన్ 3000 నుంచి 6000 పెంచి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చిందని చెప్పారు. ఇంకా సూపర్ సిక్స్‌లో పేర్కొన్న ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ జరుగుతుందని, అందుకు సచివాలయ సెక్రటరీలతో టీమ్స్‌ను ఏర్పాటు చేశామని, అలాగే పింఛన్ లబ్ధిదారులకు సీఎం సందేశ పత్రాన్ని కూడా అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఈ కిరణ్, ఆర్ఐ నారాయణరావు, సచివాలయ సెక్రటరీలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో మంత్రి


కందులపదంలో పింఛన్ లబ్ధిదారులతో మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్: మండలంలోని కందులపదంలో స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో నలుగురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన రూ.4వేలతో పాటు మూడు నెలలకు రూ.1000 చొప్పున కలిపి మొత్తం రూ.7 చొప్పున పింఛన్ అందజేశామన్నారు. మక్కువ మండలంలో కూడా పింఛన్లు పంపిణీ చేశారు.

'నేను బడికి పోతా'ను విజయవంతం చేయాలి


ర్యాలీలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం ఈశ్వరరావు

సీతానగరం: ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహించే 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా పిల్లలను బడికి పంపించే విధంగా పేరెంట్స్‌కు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో నేను బడికి పోతా కార్యక్రమంపై ఎంఈఓలు జి. సూరిదేముడు, ఎం.వెంకట రమణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ ఈశ్వరరావు మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడికి వచ్చే విధంగా పిల్లల పేరెంట్స్‌కు అవగాహన కల్పించి పాఠశాలల్లో చేరేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించినట్లు తెలియజేశారు. బడిబయట ఉన్న పిల్లలతల్లిదండ్రులతో స్థానిక ఉపాధ్యాయులు అవగాహన సదస్సులు ఎస్ఎంసీ కమిటీ పర్యవేక్షణలోనిర్వహించి పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల హెచ్ఎంలు, సహోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉద్యమాలే కొరటాలకు ఘనమైన నివాళులు


కొరటాల చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నియకులు

పార్వతీపురంటౌన్: కార్మిక, కర్షక పోరాట ఉద్యమాల్లో కొరటాల సత్యనారాయణ జీవిత చరిత్ర అమోఘమని, ఉద్యమాలకు ఆయన స్ఫూర్తి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కె.సుబ్బారావమ్మ అన్నారు. కొరటాల సత్యనారాయణ 18 వ వర్ధంతి సందర్భంగా సోమవారం పార్వతీపురంలోని సుందరయ్యభవనంలో ఆయన చిత్రపటానికి సుబ్బరావమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ ఆంధ్ర కమ్యూనిస్ట్ ఉద్యమ నేతల్లో ప్రముఖుడని, భారత కమ్యూనిస్టు పార్టీ–మార్క్సిస్ట్(సీపీఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడని తన శైలిలో కీలకపాత్ర పోషించారాని కొనియాడారు. నేడు నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 2019లో తెచ్చిన మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ కొరటాల సత్యనారాయణ స్ఫూర్తితోనే నిర్బంధాలను లెక్క చేయకుండా రైతాంగం పెద్ద ఎత్తున చారిత్రాత్మక ఉద్యమం నిర్వహించిందని దీంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలిపారు. ఆ సందర్భంగా నరేంద్ర మోడీ స్వయంగా పార్లమెంటులో రైతులకు క్షమాపణలు చెప్పి మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకుంటున్నామని ప్రకటించారన్నారు. రైతుల ప్రతినిధులతో చర్చించి మద్దతు ధరలిచ్చేలా పార్లమెంటులో చట్టం తెస్తామని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చారు. కానీ ఆ చట్టాలను మరో రూపంలో అమలు చేస్తూ రైతు కేంద్రంగా ఉన్న మన వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. కేరళ తరహాలో రాష్ట్రంలో రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి


నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వాసునాయుడు

సాలూరు: అమల్లోకి వచ్చిన నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పట్టణ సీఐ వాసునాయుడు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత చట్టాలైన ఐపీసీ, సీఆర్‌పీసీ, పీసీఅండ్ఐఈఏలు రద్దయ్యాయన్నారు. నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, తదితర చట్టాలపై వివరించారు. అనంతరం నూతన చట్టాలకు సంబంధించిన ప్రతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


పాలకొండ: అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కృష్ణారావు


కొమరాడ: కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై నీలకంఠం

పాలకొండ: కొత్తగా వచ్చిన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ కృష్ణారావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం పలు గ్రామాల పెద్దలు, యువత, విద్యార్థులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొచ్చిందన్నారు. అవి జూలై 1 అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చాయని తెలిపారు. ఇకపై కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● కొమరాడ: భారత ప్రభుత్వం అమల చేసిన కొత్త చట్టాలు జూలై 1 నుంచి అమలులోకి వచ్చాయని, ఇకపై వాటి ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై కె.నీలకంఠం అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో స్థానిక నాయకులు, ప్రజలకు కొత్తగా తీసుకొచ్చిన చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. బ్రిటీష్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లను రద్దు చేసి, వాటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొచ్చిందని తెలిపారు. ప్రజలు వాటిపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

చేయూత డబ్బులు చెల్లించాలి

● సీపీఎం ధర్నా

సీతానగరం: మండలంలోని మహిళలకు వైఎస్ఆర్ చేయూత ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి లక్ష్ము నాయుడు, సీఐటీయూ నాయకుడు గవర వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేయూత పథకం కింద చెల్లించాల్సిన రూ.18,500 ఆర్థిక సహాయాన్ని చెల్లించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా లక్ష్మునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పథకం ఆర్థిక సహాయాన్ని కొంతమందికి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినప్పటికీ ఎక్కువ మందికి ఆర్థిక సహాయం బ్యాంక్ ఖతాలకు జమ చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎన్నికల ముందున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం బటన్ నొక్కగానే ఏక కాలంలో అందరికీ ఒకేపర్యాయం బ్యాంక్ ఖాతాలకు జమ అయ్యేదన్నారు. 2024లో చివరి విడతగా జగనన్న బటన్ నొక్కే సమయానికి ఎన్నికల కోడ్ నిబంధనలు రావడంతో ఇబ్బందులు వచ్చాయని, ప్రభుత్వం స్పందించి చేయూత పథకం నిధులు మంజూరు చేయాలని లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

టెన్త్‌పాసైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు


ప్రోత్సాహక నగదును అందచేస్తున్న హెచ్ఎం ప్రసన్నలక్ష్మి

సీతానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించి సుప్రీం కోర్టు న్యాయవాదిగా పనిచేసిన కీర్తిశేషులు అయ్యగారి నరసింహం (జవహర్)జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు ప్రొఫెసర్ ఆనంద్ పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

ఈ మేరకు 2023–24 విద్యాసంవత్సరంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన మర్రాపు హేంత్(551)కు రూ.2,500, ద్వితీయ స్థానం సాధించిన బంకురు లీలాప్రసన్న(547)కు రూ.1,500లు తృతీయ స్థానం సాధించిన తామరాపు హసిని(547)కి రూ.1000లు నగదు ప్రోత్సాహకాన్ని ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసన్నలక్ష్మి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డయేరియా సోకకుండా అప్రమత్తం


చిలకలపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

బలిజిపేట:

డయేరియా వ్యాధి సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి సూచించారు. డయేరియా నియంత్రణ కార్యక్రమంలో భాగంగా చిలకలపల్లిలో సోమవారం వైద్యశాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు వైద్యశాఖ సిబ్బంది గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రతి ఇంట్లో 5సంవత్సరాల లోపు చిన్నారులకు డయేరియా సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరికైనా వాంతులు, విరేచనాలు అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఉప సర్పంచ్ గిరి, వైద్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల ధర్నా


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే పనిని కర్తవ్యంగా పెట్టుకున్నాయని, అందులో భాగమే ఉపాధి వేతన దారులపై పని భారమని వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు రెడ్డి వేణు, పి.రాము, జి.వెంకటరమణ అన్నారు. ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం పార్వతీపురంలోని సుందరయ్యభవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శోభికకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు మూడు నెలలుగా ఎండలో ఎండి రోజుకు రెండు పూటలా ఉదయం సాయంత్రం పనిచేస్తే ఒక్కో గ్రామానికి ఒక్కో విధంగా సుమారు ఐదు వారాల బిల్లులు బకాయిలు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. వెంటనే ప్రభుత్వం కలుగజేసుకుని ఉపాధి కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని. అలాగే రెండు పూటలా పనిచేయడం వల్ల వేతన దారులు రోజుకు రెండు వైపులా 10 కిలోమీటర్ల వరకు వరకు మండుటెండలో నడవాల్సి వస్తోందని దీనివల్ల ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఇలాంటి సందర్భంలో వ్యవసాయ పనులు, ఇంటి పనులు చేసుకోవడానికి తీవ్ర ఆటంకంగా మారిందన్నారు. కాబట్టి రెండు పూటలా పనిని రద్దుచేసి ఒక్క పూట పని ఇవ్వాలని అలాగే యాంత్రీకరణ పెరగడం వల్లన వ్యవసాయంలో పని దినాలు భారీగా తగ్గాయని అందుకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు వేతనం 400 రూపాయలు తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య వెంటనే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధి వేతనదారులు జి. సింహాచలం, హెచ్ పెంటయ్య, ఎస్. చంద్ర, జె.శివుడు, కె.బూసన, ఎస్. కోమల, కె. ఆది తదితరులు పాల్గొన్నారు.

రెండు పూటలా ఉపాధి పని వద్దు

సీతానగరం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా అమలు చేయడం దుర్మార్గమైన చర్య అని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు అన్నారు. ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం మండల కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో మండుటెండలో ఉపాధి పనులు రెండుపూటలూ చేయాలని మార్గదర్శకాలు విడుదల చేయడంతో ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడ్డారన్నారు. అలాగే పనిచేస్తున్న వేతనదారులకు 10 నెలలుగా బిల్లులు అందకపోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోందని, మరికొన్ని గ్రామాల్లో అయిదు వారాల బిల్లులు చెల్లించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలియజేశారు. ఉపాధి పనులు చేసినా బిల్లులందక ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. వేతనదారులకు బాకీ పడిన బిల్లులు తక్షణమే వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అలాగే రెండు పూటలూ పని చేయాలన్న నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు. ఎండ వడదెబ్బకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వేతనదారులకు మెడికల్ బిల్లులు చెల్లించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసరాల సరుకుల ధరలకు అనుగుణంగా వేతన దారులకు రోజు కూలీగా రూ.400లు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని, వేతన దారులకు మౌలిక సదుపాయాలు కల్పించి, ముడిసరుకులు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి వేతన దారుల సంఘం సభ్యులు సూర్యనారాయణ, రామారావు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఏపీఓ భానుకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు

కూలిన పూరిల్లు


కూలిన ఇంటి వద్ద బాధితులు

కొమరాడ: మండలంలోని గుణదతీలేస్ పంచాయతీ కొరిశీల గ్రామంలో బడె ప్రసాద్‌కు చెందిన పూరిల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. ఉండేందుకు గూడు లేక బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఎవరూ తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

పైనాపిల్ వ్యాన్ బోల్తా

సీతంపేట: రుక్మిణిగూడ ఘాట్ రోడ్‌లో సోమవారం పైనాపిల్ లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. విశాఖపట్నం మార్కెట్‌కు పైనాపిల్ పంటను తరలిస్తుండగా వ్యాన్ బ్రేకులు ఫెయిల్ అవడంతో అదుపుతప్పి బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు.

క్లుప్తంగా

గర్భిణుల హాస్టల్ సిబ్బందికి బకాయి వేతనాలివ్వాలి

పార్వతీపురం టౌన్: గుమ్మలక్ష్మీపురం, సాలూరు వైటీసీల్లో పార్వతీపురం ఐటీడీఏ ఏర్పాటు చేసిన గిరిజన గర్భిణుల వసతి గృహాల్లో సేవలు అందిస్తున్న సిబ్బందికి గడిచిన పద్దెనిమిది నెలలుగా ఇవ్వాల్సిన బకాయి వేతనాలు తక్షణమే ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈమేరకు సోమవారం ఆయన గర్భిణుల వసతి గృహం సిబ్బందితో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్దెనిమిది నెలలుగా వేతనాలు రాకపోతే కుటుంబాలతో ఎలా బతకాలని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిబ్బంది కె.శాంతి సుధ, ఎం.వజ్రం, యు.మహాలక్ష్మి, ఎ.కళావతి, పి.రమాదేవి, యు.ప్రభావతి, పి.పద్మావతి, బి.శకుంతల, టి.సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తన్యాయ చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: కేంద్రప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన న్యాయచట్టాలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించుకోవాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, మోటార్ వాహనాల ప్రతినిధులు పాల్గొన్నారు.

99 శాతం పింఛన్ల పంపిణీ


రంగంపేటలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

సీతానగరం: ఎన్టీఆర్ భరోసా సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమం జిల్లాలోని గ్రామాల్లో 99 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేశామని డ్వామా పీడీ రామచంద్రరావు తెలిపారు. ఎన్టీఆర్ సామాజిక పింఛన్ పథకం ద్వారా రంగంపేటలో పంపిణీ చేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆకస్మికంగా ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్లు సకాలంలో పంపిణీ చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, వీఆర్వోలు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

సీతానగరం: మండలంలోని పెదభోగిలి గ్రామానికి చెందిన మహిళ (36) కనిపించడం లేదని ఎవరికైనా కనిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన మహిళ గత నెల 28 నుంచి కనిపిం చడం లేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు. ఎవరికైనా కంటబడితే ఫోన్ 9121109457, 7287968265 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐల కన్వీనర్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు తనిఖీ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 27, 28 తేదీలలో ఉదయం 9 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

మినీ ఉద్యోగమేళాలో 47 మంది ఎంపిక


అభ్యర్థులను ఎంపిక చేస్తున్న సిబ్బంది

సీతంపేట: స్థానిక వైటీసీలో సోమవారం మినీ ఉద్యోగ మేళా నిర్వహించారు. జీఎంఆర్ రక్షా సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డు పోస్టులకు ఎంపికలు నిర్వహించారు. మొత్తం 65 మంది అభ్యర్థులు హాజరుకాగా.. వారిలో 47 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వైటీసీ మేనేజర్ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో జీఎంఆర్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ హనుమంతురావు, ఏపీఓ గణేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.